క్లుప్తంగా

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

• ఆర్డీఎంఏ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఎంఏ నాగరాజు

పార్వతీపురం టౌన్: పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఆర్డీఎంఏ నాగరాజు అన్నారు. తన పర్యటనలో భాగంగా మంగళ వారం ఆయన పార్వతీపురం మున్సిపల్ కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణం లోని వరహాలగెడ్డ ముంపునకు గల కారణాలు అడిగి తెలుసుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి హోం కంపోస్టు విధానం అమలు చేసేందు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్, ఏఈ ఆనంద్, ఆర్ఓ రుబేను, ఆర్ఐలు నారాయణరావు, వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై డీఏపీ, యూరియా వంటి ఎరువులను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సబ్సిడీపై అందిస్తున్న వీటిని తీసుకుని సద్విని యోగం చేసుకోవాలని సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణపతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయిప్రభ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయరూ..?



బురదమయమైన కొమరాడ అంతర్ రాష్ట్ర రహదారి

కొమరాడ: స్థానికంగా ఉన్న అంతర్ రాష్ట్ర రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఒడిశాతో పాటు మరో మూడు రాష్ట్రాలకు వెళ్లే ఈ రోడ్డు అధ్వానంగా తయారైందని, దీంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డంతా బురదమయమవుతోందని, అలాంటి సమయంలో ఈ రోడ్డు మీదుగా వెళ్తున్న చిన్నచిన్న వాహనాలు బురదలో కూరుకుపోయి నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే అయినా ఈ సమస్యను పట్టించుకుని, పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని అంటున్నారు.

హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లపై అధికారుల ఆగ్రహం



హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లను నిలదీస్తున్న ఏటీడబ్ల్యూవో, ఎంఈవో

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గ్రామ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలురు) హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లపై ఎంఈవో బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం ఆ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన సదరు అధికారులు.. ఆ సమయంలో హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్‌లిద్దరూ పాఠశాలలో లేకపోవడంపై మండిపడ్డారు. విధులకు వచ్చి, బయటకు వెళ్లిపోవడమేంటని ప్రశ్నించారు. విద్యార్థులను సంరక్షించేది ఇలాగేనా అంటూ నిలదీశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారి తీరుపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు ఎంఈవో, ఏటీడబ్ల్యూవో తెలిపారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి, మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని సూచించారు.

మత్స్య అవతారంలో జగన్నాథస్వామి



పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జగన్నాథస్వామి మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం దాస్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ధరల నియంత్రణకు ప్రత్యేక కౌంటర్లు

పార్వతీపురం:

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు జిల్లాలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత శాఖాధికారులు, రైస్‌మిల్లర్స్, హోల్‌సేల్, రిటైల్ డీలర్స్‌తో ధరల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు స్థిరమైన ధరలకు నిత్యావసర వస్తువులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బియ్యం, కందిపప్పును ప్రత్యేక కౌంటర్లలో విక్రయించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రత్యేక కౌంటర్లలో కందిపప్పు 160, డీపీటీ లేదా సోనామసూరి స్టీమ్డ్ రైస్ రూ. 49, ముడిబియ్యం రూ.48లకు విక్రయించేలా వ్యాపారులకు ఆదేశించామన్నారు. ధరలకు సంబంధించి షాపుల్లో బ్యానర్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రత్యేక కౌంటర్లలో విక్రయాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పర్యవేక్షించి రోజువారీ నివేదికలను సమర్పిస్తారన్నారు. కార్యక్రమం సజావుగా జరిగేలా డీలర్లు సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కె.శివప్రసాద్, మార్కెటింగ్‌శాఖ అధికారి ఎల్.అశోక్ కుమార్, రైస్‌మిల్లర్స్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లర్స్, హోల్‌సేల్ డీలర్స్‌తో సమీక్షిస్తున్న డీఆర్ఓ కేశవనాయుడు

తైక్వాండోలో పార్వతీపురం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

పార్వతీపురంటౌన్: తైక్వాండో క్రీడలో పార్వతీపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జూన్ 30, జూలై 1తేదీలలో 7వ క్యాడెట్ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ చాంపియన్ షిప్ విశాఖపట్నంలో జరిగిన 12–14 సంవత్సరాల తైక్వాండో బాలికల విభాగంలో కె.హసిత, కె.శ్రీ హిత కాంస్య పతకాలు, బాలుర విభాగంలో ఎం.భార్గవ్, వి.సాయి నవనీత్ కాంస్య పతకాలు సాధించినట్లు కోచ్ అనిల్ శర్మ తెలిపారు. పతకాలు సాధించిన వారికి ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర చేతుల మీదుగా మెడల్స్ అందించారు. తైక్వాండో ఫెన్సింగ్ కోచ్ అనిల్ కుమార్ శర్మ, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

జ్వరపీడితులను గుర్తించేందుకు సర్వే

సీతానగరం: గ్రామాల్లో వచ్చే సీజనల్ వ్యాధులను గుర్తించడానికి ముందు జాగ్రత్తచర్యగా ఇంటింటి సర్వే చేయనున్నట్లు సీతానగరం పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్‌వీ రమణ, హెల్త్ సూపర్‌వైజర్ రమణ తెలిపారు. ఈ మేరకు సూరంపేట పంచాయతీలోని మరిపివలస, చిన్నారాయుడుపేట సూరంపేట గ్రామాల్లో హెచ్ఏ చంద్రినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం విషజ్వరాలపై ఇంటింటి సర్వే జరిగింది. ఈ కార్యక్రమం పరిశీలన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో అక్కడక్కడ వస్తున్న సీజనల్ వ్యాధుల్లో భాగంగా జలుబు, దగ్గు,జ్వరం వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటువంటి జ్వరాలకు తావివ్వకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా సిబ్బంది సహకారంతో ఇంటింటికీ వెళ్తూ కుటుంబసభ్యుల వివరాల సేకరణ, ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలతో సతమతమవుతున్నారో తెలుసుకోనున్నట్లు చెప్పారు. అలాగే ఇంటింటి సర్వే చేసే సమయంలో ఇంటి గోడలపై మార్కింగ్ చేస్తారన్నారు. ఇంటింటి సర్వే కోసం వస్తున్న వారికి ప్రజలు, కుటుంబయజమానులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



ఇంటిగోడపై సర్వే రిపోర్టును పరిశీలిస్తున్న హెల్త్ సూపరువైజర్ శర్మ

మితిమీరిన వేగంతో ప్రమాదాలు



హనుమాన్ జంక్షన్ వద్ద మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

• వాహనచోదకులకు అవగాహన

సీతానగరం: రోడ్డుపై వాహనాలతో మితిమీరిన వేగంతో వెళ్లడంవల్ల ప్రమాదాలు కొనితెచ్చుకోవడమే అవుతుందని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు రాష్ట్రరహదారిపై హనుమాన్ జంక్షన్ వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేయడంతో పాటు వాహన చోదకులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన చోదకులు ప్రయాణం చేయాల్సి వచ్చినప్పుడు ముందుగా పయనం కావాలని, వాహనం జోరుగా, లైసెన్స్ లేకుండా నడపడం చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్స్ ఉన్నా లేకున్నా, మద్యం మత్తులో వాహనాలను అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే వాహనాలకు సంబంధించిన రికార్డులు వాహనంలో ఉంచుకోవాలని లేని పక్షంలో మోటారు వాహనాల యాక్ట్‌కు అనుగుణంగా అపరాధ రుసుం విధించనున్నామని తెలిపారు. అలాగే అనుకోవిధంగా ప్రమాదాలు జరిగినపుడు ఆత్మరక్షణకు వేగాన్ని నియంత్రించడం, వెనుకనుంచి, ఎదురుగా వస్తున్న వాహనాల రాకపోకలు గుర్తించాలని, హెల్మెట్ అవసరాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. హెల్మెట్ విధిగా ధరించాలని స్పష్టం చేశారు. అలాగే పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ నిమిత్తం ఆపినప్పుడు వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై జి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలను అదుపు చేయవచ్చని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా మంగళవారం రోడ్డు భద్రతపై, నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వరాదన్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న ప్రమాదాలకు వాహన యజమానే పూర్తి బాధ్యులన్నారు. నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలని, ప్రమాదలు సంభవిస్తే క్షతగాత్రులకు సహకరించాలన్నారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పల్లా మునిస్వామి, ఎం.వెంకటేశ్వరారావు, మరిచర్ల జగన్మోహనరావు, నరసింగరావు, రాంబాబు, వెంకటరమణ, గోవిందరావు, కె.వెంకటరావు, చందక జగదీష్‌కుమార్, నల్లి శివప్రసాద్, కనపాక సూర్యప్రకాష్ తదితరులున్నారు.



వాహనచోదకులకు రోడ్డుభద్రత నిబంధనలను వివరిస్తున్న ఎస్సై

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

పాలకొండ రూరల్: వాహన చోదకులు నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం రహదారిలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ద్విచక్రవాహన చోదకులు కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. ఆటో, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యక్తిగత పరిశుభ్రత విధిగా పాటించాలి



పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి సంతోషిలక్ష్మి

భామిని: స్థానిక కేజీబీవీలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ వి.సంతోషిలక్ష్మి నేతృత్వంలో వైద్యుల బృందం విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్ఓ సీహెచ్.భాస్కరరావు, సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి సమస్యలపై సూచనలు చేశారు. జ్వర లక్షణాలున్న విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. సిక్ రూంలో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మెడికల్ క్యాంపు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సత్యం

సీతంపేట: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ కొండపల్లి సత్యం అన్నారు. మండలంలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయం పరిధిలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. బావుల్లో క్లోరినేషన్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే కుడ్డపల్లి నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపు పర్యవేక్షించారు. ఈ ఎపిడమిక్ సీజన్‌లో మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం పంపిణీ



గర్భిణులకు అన్నప్రసాద ప్యాకెట్లు అందిస్తున్న సేవాసమితి సభ్యులు

పాలకొండ రూరల్: సత్యసాయి సేవాసమితి సభ్యులు మండలంలోని అన్నవరం పీహెచ్‌సీలో మంగళవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గర్భిణీలకు అన్నప్రసాదం ప్యాకెట్లు అందించారు. ఆధ్యాత్మిక వక్త ఎస్‌వీ రమణ సద్గుణ సూక్తులను వివరించారు. భగవాన్ శ్రీసత్యసాయి మార్గం అనుసరణీయమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వంద మందికి అన్నప్రసాదం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సేవాసమితి సహకారంతో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

వాహన తనిఖీలు



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు

కురుపాం: వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ పెట్రోల్‌బంకు దగ్గర సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టిన ఆయన.. అటువైపుగా వస్తున్న వాహనదారులను ఆపి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. వాహనాలతో రోడ్డుమీదకు వచ్చేటప్పుడు లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యంతాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఆటపాటలతోనే నాణ్యమైన విద్య

సీతానగరం: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో ఆట,పాటలతోనే ఉపాధ్యాయులు విద్యాబోధన నిర్వహించాలని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని పణుకుపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు తరగతిగదుల్లో విద్యావ్యాప్తిని పెంపొందించడానికి, విద్యార్థులు విద్యపట్ల ఆకర్షితులయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సూచించారు. అనంతరం 1,2 తరగతుల విద్యార్థులతో తెలుగు అభినయ గేయాలు పాడించి, వర్ణమాల చదివించి, అంకెలు, సంఖ్యలు, కూడికలను పరిశీలించారు. అలాగే 3,4,5 తరగతుల విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించి, చతుర్థిప్రక్రియ చేయించి విద్యార్థులందరికీ న్యూ టెస్ట్ బుక్స్ అందిందీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదుల పరిశుభ్రతలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకంలోవంటల రుచులను పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చప్ప ఈశ్వర రావు, సహోపాధ్యాయులు, సీఆర్పీలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.



పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంఈఓ జి.సూరిదేముడు

గర్భిణుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

సీతానగరం: గర్భిణుల ఆరోగ్యభద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని, తరచూ వైద్యసిబ్బంది పర్యవేక్షిస్తారని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని అన్నారు. పీఎంఎస్ఎంఏ పథకం అమలులో భాగంగా మంగళవారం ఆమె పీహెచ్‌సీలో ఆమె 35 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు ప్రతినెలా పీహెచ్‌సీ ల్యాబ్‌లో హిమోగ్లోబిన్, ఎనీమియా తనిఖీలు నిర్వహించి సుఖమయ ప్రసవానికి అనుకూలంగా ఉండేందుకు, తల్లీశిశువులు ఆరోగ్యంగా ఉండేలా పీహెచ్‌సీలో అవసరమైన వైద్యసేవలు అందించనున్నామని చెప్పారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సమకూర్చుతున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా భుజించాలని సూచించారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది, సూపర్‌వైజర్లు గర్భిణుల ఆరోగ్యానికి సంబంధించిన యోగక్షేమాలపై సమాచారం సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్ వి రమణ, హెల్త్ సూపర్‌వైజర్లు సత్యవతి, శర్మ, భవాని,ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గర్భిణుల పేరెంట్స్ పాల్గొన్నారు.



గర్భిణులను తనిఖీ చేస్తున్న డాక్టర్ బి. పావని

భవిత కేంద్రాల తనిఖీ



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సహిత్య విద్య కోఆర్డినేటర్ ఎన్. అమ్మినాయుడు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలోని భవిత కేంద్రాలను రాష్ట్ర సహిత్య విద్య కోఆర్డినేటర్ ఎన్.అమ్మి నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో డీవీఎం పాఠశాలలో గల భవిత కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 15 భవిత కేంద్రాలను ఈ రెండు రోజుల పాటు తనిఖీ చేయనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మే, జూన్ నెలలో నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో గుర్తించిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలును ఏఏ పాఠశాలలో జాయిన్ చేశారు, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు 15 మండలాల్లో ఫిజియోథెరపీ సర్వీసెస్ ఏ విధంగా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు విజిట్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సదరం సర్టిఫికెట్లు యూడీఐడీ కార్డులు తెప్పించడంలో సమగ్ర శిక్ష ఉద్యోగులైన ఐఈఆర్పీలు ఏ విధంగా పనిచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీవీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.గోవింద్, సహిత్య విద్య కోఆర్డినేటర్ భానుమూర్తి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో మేలు

భామిని: మండలంలోని మూలగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్లు నాగేష్, చిరంజీవిరావు ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే బీజామృతం, వివిధ కషాయాలను ఎలా తయారు చేస్తారో వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం వల్ల సాగు ఖర్చు పెరిగిపోవడంతో పాటు భూసారం దెబ్బతింటుందని, ఫలితంగా పంట దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. సేంద్రియ వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో మేలైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు.



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న వెలుగు ప్రతినిధులు

కౌలురైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

వీరఘట్టం: నేటి నుంచి మూడు రోజుల పాటు కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరు కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ కె.జయప్రకాష్ మంగళ వారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈనెల 10న తలవరం, పనసనందివాడ, కుమ్మరిగుంట, నీలానగరం, తెట్టంగి, వీరఘట్టం, చిన్నగోర, పెద్దూరు, బూరుగ, చలివేంద్రి, జె.గోపాలపురం రెవెన్యూ గ్రామాల్లో, ఈనెల 11న దశుమంతపురం, సంత–నర్సిపురం, నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ, కిమ్మి, వండవ, అడారు, బిటివాడ, బియ్యంవలస, డెప్పివలస, తూడి, పీవీఆర్ పురం, చిదిమి, యు.వెంకమ్మపేట, పాలమెట్ట గ్రామాల్లో, ఈనెల 12న బొడ్డపాడు, రేగులపాడు, కొంచ, హుస్సేనుపురం, కత్తులకవిటి, ఎం.రాజపురం, కుంబిడి, చిట్టపులివలస, విక్రమపురం, శ్రీహరిపురం, మొదటికెల్ల, కడకెల్ల, నడిమికెల్ల, కంబర రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.